
# ఆనవాయితీ

మహోత్సవం జరుపుకోలేదు కాని షష్ఠి పూర్తి మాత్రం అయిపోయింది జగన్నాథానికి, ఉద్యోగంనుంచి విశ్రాంతి తీసుకోమన్నారు ప్రభుత్వంవారు. అతడు పని చేసినది ఆర్థికశాఖలో. తన యౌవనాన్ని ఉత్సాహాన్నీ కవిత్వాన్నీ సంగీతాన్నీ అభిరుచుల్నీ అన్నింటినీ భయభక్తులతో ఆ ఉద్యోగానికి అర్పించిన త్యాగధనుడు జగన్నాథం.




అవకాశం దొరికితే ఒక రచనను వ్రాసి నాలుగు డబ్బులు చేసేసుకుంటాడు. సంగీతాన్ని వినేస్తాడు. భార్య జడలో మల్లె చెండును పిల్లిలా వెనకచేరి ఆఘ్రాణించేస్తాడు. పిల్లవాడికి బ్రతుకుతెరువుల్ని పథ్యతనీ బోధించి మంచి మార్గంలో పెట్టేస్తాడు. కాని ప్రభుత్వం అతడి కంఠకంటె గౌరవమైన-అంటే గురుతరమైన బాధ్యతల నప్పగించింది. ఇందుకు జగన్నాథం వంటి స్వార్థత్యాగధనులే అవసరం.

జగన్నాథం తన ఇరవైయో పడిలోంచి యాభైయ్యో పడి వరకూ ప్రభుత్వ సేవలో గడిపి మళ్ళా జీవితంలో ప్రవేశించాడు. ఇన్నాళ్ళదీ జీవితమో మరేమో అతడ్ని అడిగినా చెప్పలేడు. తీరుబాటు చేత ఇప్పుడిప్పుడు సంగీతమనేది ఈ లోకంలో ఉందనీ తన బాల్యంలో ఎంతగానో అనుభవించి ఆనందించే వాడనీ గుర్తిస్తున్నాడు.

ఉద్యోగంలో ప్రవేశించిన కొత్తరికంలో గిజగిజా తన్నుకు పోయేవాడు. అభిరుచులను తీర్చుకోవడానికి క్షణమైనా తీరిక లేక పోయిందని టైముంటే విచారించే వాడు. రచనలు టేబిలుమీదనుంచీ బెంచీమీదికీ బెంచీమీదనుంచి కిందకూ దిగి ఒక్కొదాటులో చిత్తుకాగితాల బుట్టచేరి ఎప్పుడు అమ్ముడు పడ్డాయో తెలియనే లేదు. బాడ్మింటన్ రాకెట్ విరిగి ముక్కలై పెంటకుప్పను అలంకరించింది. "అన్నట్లు అదేమైంది" అని జ్ఞాపకం వచ్చినప్పుడొకసారి ఝూం మనిపోయే వాడు. కాని - భార్య "మీ కేమన్నా తీరుబాటా ఇవన్నీ చేయటానికి" అనడంతో 'ఔను' అనుకున్నాడు. కొడుకుమాత్రం నాన్నగారిగదిలో ప్రకృతి దృశ్యాలకూ ఆయన తీసే కూనిరాగాలకూ ముచ్చటపడే వాడు. 'తన కుమారుణ్ణి మంచి విద్యావంతుడుగా సంస్కృతి గలవాడిగా చేయాలి. తనగతి తప్పని సరిగా డెబ్భైనాలుగు జీతంలోకి ప్రవేశించింది. కొడుకుని మాత్రం కనీసం ఏ లెక్చరరుగానో చేయాలని' అనుకునేవాడు.

పిల్లలు పెరిగారు. సంసార బాధ్యతలు చుట్టుముట్టాయి. అవసరాలు హెచ్చాయి. అవసరాలు హెచ్చినంత వేగంగా ఆదాయం హెచ్చవలేదు. కాబట్టి తగ్గినట్టు కనిపిస్తోంది. రాత్రి ఏ తొమ్మిదికో వచ్చినా పెద్దవాడు మేల్కొనే ఉండేవాడు. వాడిపైనే ఆశలన్నీ పెట్టుకున్నాడు జగన్నాథం. ఏ పుస్తకం అవసరమున్నా - మాష్టరుగారు ఫలానా సినీమా చూడమన్నారని అన్నా - వెంటనే ఆ కోరిక తీర్చేవాడు. పెదవాడు పెద్దవాడై తనను సుఖపెడతాడని నమ్మకంలో ఉండేవాడు. ఆ పట్టుదలతోనే చదువుకు ఎక్కడా అంతరాయం కలగకుండా తను ప్రయత్నించాడు. అయినా కలిగింది. తనేం చేస్తాడు! స్కూల్ ఫైనలు పూర్తిచేయడం బ్రహ్మాండం తలక్రిందు లయింది. ఆ యేటి కాయేడు సంసారాన్ని నడపడం కష్టతరమౌతూంది. తక్కిన పిల్లల చదువులూ నిత్యావసరాలూ మరి యివన్నీ - ఎక్కడి నుంచని వీటికి తేవడం?

అల్లాంటి తరుణంలో పెదవాడు కళలనీ నాటకాలనీ కొత్త తెలియజెప్పి చెప్పకుండానూ తిరుగుతున్నాడు. చెప్పే విధంగా జగన్నాథం చెప్పిచూశాడు. ఏదో స్కూల్ ఫైనలు అయిందనిపించాడు పెద్దవాడు. ఇంకా చదువుకోమని వేధించుకు తింటారేమో అని బెంగటిల్లాడు. ఇంక ఇంతలో విడిచిపెడితే బాగుండు ననుకున్నాడు. పరిస్థితులన్నీ చూసి తనచదువింకా చెప్పించడం వీళ్ళతరం కాదని ధైర్యం చెందాడు.

జగన్నాథం రిటైరవడంతోనే కొన్ని ఆలోచనలూ తర్జన భర్జనలూ జరిగాయి. ఏదైనా కుటుంబభవిష్యత్తు బాగుపడాలంటే తన కొడుకు విద్యాధికుడవాలని జగన్నాథం పట్టుదల. ప్రస్తుతపు ఇబ్బందులకు వెరిచి ఏ గుమాస్తాగానో ప్రవేశపెడితే జీవితమంతా తనలాగే విచారించవలసి వస్తుందని ఆలోచించాడు. సాధ్యమైనంతవరకూ తన సంతానాన్ని ఉన్నతోద్యోగాలకు వెళ్ళేట్లు తయారుచేయాలని నిశ్చయించాడు. పెద్దవాడి ఇష్టాయిష్టాల అవసరం లేకుండానే

కాలేజీలో ప్రవేశపెట్టాడు. ప్రావిడెంటు ఫండు వాలుగురాళ్ళున్నాయని ధైర్యంఒకటి వుంది.

కాలేజీలో చదువుతున్నాడుకాబట్టి పెద్దవాడికి అరుచెప్పులకు బదులు బూట్లూ, పైరాయీలకు బదులు పాంట్లూ మార్చవలసి వచ్చింది. ఖర్చు అనుకోకుండా పెరిగింది. కళాశాలవిద్యార్థికావడం పెద్దవాడి కళాపోషకి సాంఘిక చైతన్యానికీ ఎరింతతోడ్పడి అవకాశాల్ని అర్హతని చేకూర్చింది. కాలేజీ చదువుకి డబ్బు మంచినీళ్ళలా ఖర్చు అవుతోంది.

అమ్మాయికి మంచి సంబంధం వచ్చింది. అయిందనిపించమంటున్నారు బంధువర్గమంతాను శ్రేయోభిలాషులు చెవినిల్లుకట్టుకొని పోరుతున్నారు. కట్నం హెచ్చని ఆలోచిస్తే ఇలాటిసంబంధం మరి దొరకదని భార్య హెచ్చరించింది. చివరకు ఆరేడు పెళ్లి చేయడానికే నిశ్చయించుకున్నాడు.

ఆ పెళ్ళి జరిపించానన్న తృప్తి మిగిలింది కాని కానీడబ్బు మిగల్లేదు జగన్నాధానికి.

పెద్దవాడి రెండేళ్లి ఇంటర్ చదువుకు వెచ్చించిన డబ్బంతా బూడిదలోపోసినపన్నీరయింది.

ఇంటి వ్యవహారం నడవడం దినదినం బరువవుతోంది. రెండోవాడు తనతో ఎన్నో పోర్లు అన్నాడు. కాని తనకు మహాబాధగా ఉంది—అంత చిన్నవయస్సులో అయేడే స్కూల్ ఫైనల్ పాసయిన చిన్నవాడు అప్పుడే ఉద్యోగంలో ప్రవేశించడమా అని. వాడి భవిష్యత్తు పాడవుతుందని భయం. అలాగని వాణ్ణింకా చదివించగలవనే ఆశ కూడా లేదు. చిన్నవాడికి వాళ్ల తల్లిపోలిక. ఇంట్లో పరిస్థితులు చూసి ఆగలేక పోతున్నాడు. అన్నయ్యను పడచీవాట్లు పెట్టేశాడు. 'ఇన్ని వేలు దండగచేసినందుకు ఇకనైనా ఏదోఒక ఉద్యోగం చూసుకో' మన్నాడు.

జగన్నాధం ఆవేళ ఉదయం సంసారయాత్రకు ఏమీ మార్గంతోచక ఆలోచిస్తూ కూర్చున్నాడు. ' పెద్దవాడు పరితోషంగా వచ్చి చెప్పాడు: "నాన్నా ఉద్యోగం దొరికింది." జగన్నాధం తటాలున "జీతమెంత?" అని అడిగాడు. "డెబ్భైనాలుగు" అన్నాడు పెద్దవాడు. జగన్నాథం కుంగిపోయాడు ఇక మాట్లాడలేక పోయాడు.

సంసారాన్ని ఈదడానికి కొంతవఱకూ మార్గం లభించింది. కాని రెండో పిల్ల అప్పుడే పెళ్లికావాలన్నట్టు ఎదిగికూర్చుంది. వివాహార్హతవచ్చి రెండేళ్లయినా జగన్నాధం తలపెట్టనైనా తలపెట్టలేక పోయాడు. ఎంతమంది వరుల్ని చూచినా మార్కెట్ ధరలు దుర్భరంగా కనిపిస్తున్నాయి. రెండు వేలు కట్నమైనా పట్టుకుంటేగాని మగవాడ్ని పోలిన 'చిన్న గుమాస్తా వరుడు' కూడా




లభించడు "ఎక్కడివి రెండు వేలు?"...

"మరెలాగండీ" అన్నది జగన్నాధం భార్య.

"సర్దుకొని మిగల్చుకోలేమా" అన్నాడు పెద్దవాడు.

"అంతసులభంగా ఉందా సర్దుకోవడమంటేను. నీ జీతానికి రెండు రెట్లు ఆదాయముంటే మరి రెండేళ్లకైమాట" అన్నాడు జగన్నాధం.

చిన్నవాడు ఇదంతా విన్న నాలుగు రోజుల్నుంచీ తెగతిరగడం ఆరంభించాడు. వారంరోజులు పోయాక నాన్నగారి ఎదుట తిన్నగా కూర్చొని "నేనుకూడా ఉద్యోగంలో ప్రవేశించాను నాన్నా" అన్నాడు.

జగన్నాధం ఆశ్చర్యపోయాడు. చిరాకుపడ్డాడు. అంతకంటె ఏమీ చెయ్యలేక పోయాడు.

"గుమాస్తాయేనా" అన్నాడు ఒకగడియ ఆగి.

"ఏదోఒకటి. ఆ రెండేళ్ళు దాటాకనైనా చెల్లిపెళ్లి చెయ్యాలంటావా? అందుకు ఇప్పుడే ఉద్యోగంలో ప్రవేశించాను. ఇంతకంటె గత్యంతరం లేదు." అన్నాడు చిన్నవాడు.

"గొప్పపని చేశావు" అన్నాడు జగన్నాధం అర్థరహితంగా.


జగన్నాధం తల పట్టుకొని కూర్చున్నాడు. చిన్నవాడిమాటల్లో సత్యాసత్యాల పరీక్ష చేయలేదు.

జగన్నాధం భవిష్యత్తువైపు చూస్తున్నాడు.

ఎటఎదుట ముడుతలపడిన శరీరాలతోనూ, నిర్జీవమైన కళ్ళలోనూ— చిరుగు చొక్కాలను పాతకోటు వెనక కప్పుకోడానికి ప్రయత్నిస్తూ—యిద్దరు కొడుకులూ కనిపిస్తున్నారు.

జగన్నాధం ఏదో గొణుక్కున్నాడు. ★


# నారసింహ లేహ్యము




బంగారుతో చేరినది మేహము, సెక్షాత, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20 తు డబ్బీ రు. 3-4-0 పోస్టేజిరు 1-1-0

ఏ. పి. ఏ. అండ్ కంపెనీ ఆయుర్వేద వమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.